

హైదరాబాద్ వార్త

# రేపు రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల బంద్

**ఫీజుల రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసే వరకూ ఆందోళన**

**బిసి యువజన సంఘం నేత అంజీ**

**సైఫాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు ఫీజుల రీయిం బర్స్ మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగిం చాలని, తక్షణమే 800 కోట్లు ఫీజుల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా 'కళాశాలల బంద్' కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నామని బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపల్లి అంజీ తెలిపారు. ఈ బంద్‌కు ఇప్పటికే 18 బిసి సంఘాలు మద్దతు ప్రకటిం చాయని విద్యార్థులు ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, పిజి, డి గ్రీ తదితర కోర్సులు చదువుకున్న విద్యార్థులకు కళాశాలల యాజ మానాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఫీజులు చెల్లిం చలేక అనేక ఇబ్బందులకు గురవుతుంటే ప్రభుత్వం రోజుకొక జివో జారీ చేసి విద్యార్థుల్లో గందగోళం సృష్టిస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి, లేని పక్షంలో అన్ని విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అంజీ హెచ్చరించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జివో నెంబర్లు 8, 9 లను ఉపసంహరించుకోవాలని కోరారు.




భాగ్యనగరంలో మువ్వల సవ్వడి 3

మువ్వల సవ్వడి నృత్యోత్సవంలో కళాకారులకు అవార్డులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు



కోలాహలంగా పల్స్‌పోలియో 3

ఉప్పల్ ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, జిల్లా వైద్యాధికారి డా.ఉమాగౌరి తదితరులు



# ఎందుకో చెప్పరు!

- ●ఎలా చేయాలో తెలియదు
- ●తప్పు ఎక్కడుందో చెప్పకుండా ఒకే ఒక్క లైన్ రిమార్క్..
- ●కొంపముంచుతున్న అస్పష్టమైన కారణాలు
- ●ఓటరు దరఖాస్తుల తిరస్కరణతో నగరంలో మధ్యవయస్కులకు షాక్

**హైదరాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ వేగంగా సాగుతున్న వేళ, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకుంటున్న హైదరాబాద్ వాసులకు ఎన్నికల సంఘం నిర్ణయాలు తీవ్ర నిరాశను మిగులుస్తున్నాయి. వయసు పైబడినా ఇప్పటివరకు ఓటు హక్కు లేని అనేకమంది మధ్యవయస్కులు, భవిష్యత్తులో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఇటీవలే ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఎలాంటి సరైన వివరణలు లేకుండా, అస్పష్టమైన సాంకేతిక కారణాలు చూపుతూ అధికారులు భారీ సంఖ్యలో దరఖాస్తులను తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దరఖాస్తులను ఎందుకు తిరస్కరించారో కనీసం పూర్తి వివరాలు కూడా చెప్పడం లేదని, "ఫోటో సరిగ్గా లేదు, సంతకం లేదు, పత్రాలు జతపరచలేదు" అంటూ కేవలం ఒకే ఒక్క లైన్ రిమార్కుతో అప్లికేషన్లను కొట్టివేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బంజారాహిల్స్ రోడ్ నెం. 14కు చెందిన ఒక 45 ఏళ్ల మహిళ మొదటిసారి ఓటు కోసం దరఖాస్తు చేసుకోగా, అన్ని పత్రాలు సరిగ్గా ఉన్నప్పటికీ ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా దరఖాస్తును తిరస్కరించినట్లు తెలుస్తోంది. తప్పు ఎక్కడుందో చెబితే సరిదిద్దుకునే వాళ్లమని, అలా కాకుండా ఈ విధంగా తిరస్కరిస్తే మళ్లీ ఎలా దరఖాస్తు చేయాలో అర్థం కావడం లేదని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పారదర్శకతే ముఖ్యం: అధికారుల వివరణ**

ఇదే అంశంపై సంబంధిత అధికారులు స్పందిస్తూ.. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి పరిశీలన జరిగిన తర్వాతే, లోపాలు ఉన్న దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. మసకగా ఉన్న ఫోటోలు అప్లోడ్ చేయడం, స్పష్టత లేని లేదా తప్పుడు సహాయక పత్రాలు సమర్పించడం, డిక్లరేషన్ ఫారాలపై సంతకాలు చేయకపోవడం, దరఖాస్తులు పూర్తిస్థాయిలో నింపకపోవడం వల్లే అత్యధికంగా రిజెక్ట్ అవుతున్నాయని ఆయన వివరించారు.

**తదుపరి ఏం చేయాలి?**


ఓటరు జాబితా పారదర్శకత కోసం స్క్రూటినీ తప్పనిసరని అధికారులు చెబుతూనే, దరఖాస్తుదారులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణకు గురైన వారు అధైర్యపడకుండా, లోపాలను సరిదిద్దుకుని కొత్తగా మళ్లీ ఫామ్ 6 సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు చేసే సమయంలో ఫోటోలు స్పష్టంగా ఉన్నాయా? సంతకం చేశామా? వయస్సు, నివాస ధృవీకరణ పత్రాలు సరిగ్గా అప్లోడ్ అయ్యాయా లేదా అనేది ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సూచించారు. మరోవైపు, ఓటరు నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయాలని, తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా వివరిస్తూ దరఖాస్తుదారులకు తగిన మార్గదర్శకత్వం చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

# డర్టీ ఫుడ్

**కిచెన్‌లలో బొద్దింకలు, పురుగులు**


- ★తెరిచి ఉన్న డ్రెయిన్లు ★లేబుళ్లు లేని ఆహార పదార్థాలు ★ఫ్రీజర్లలో నిల్వ ఉంచిన పిండివంటలపై బొద్దింకలు
- ★యాజమాన్యాలకు నోటీసులు
- ★ఐటీ కారిడార్ ప్రముఖ రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ కలకలం

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** నగరంలోని ఐటీ కారిడార్ పరిధిలో ఉన్న పలు ప్రముఖ రెస్టారెంట్లలో సైబరాబాద్ కమిషనరేట్ ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు తీవ్ర కలకలం రేపాయి. గచ్చిబౌలి, హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్ ప్రాంతాల్లోని బడా హోటళ్లు, రెస్టారెంట్లలో సైబరాబాద్ సీవీఎంసీ బృందాలు ఈ మెరుపు దాడులు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో ఆహార భద్రత, పరిశుభ్రత, మరియు నాణ్యతా ప్రమాణాల్లో విస్తుపోయేలా తీవ్ర లోపాలు బయటపడటంతో అధికారులు సంచలన విషయాలను వెల్లడించారు. నిబంధనలు పాటించని పలువురు రెస్టారెంట్ యాజమాన్యాలకు అధికారులు వెంటనే ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీ చేశారు. గచ్చిబౌలిలోని ప్రముఖ షా గౌస్ రెస్టారెంట్ లో వంటశాల అత్యంత అపరిశుభ్రంగా ఉండటమే కాకుండా, ఈగలు తిరుగుతూ ఉండటం, తెరిచి ఉన్న డ్రెయిన్లు మరియు లేబుళ్లు లేని ఆహార పదార్థాలను అధికారులు గుర్తించారు. ఇక్కడ పరిశుభ్రత ప్రమాణాలు కేవలం 65 నుండి 67 శాతం మాత్రమే నమోదు కావడంతో పాటు, సిబ్బందికి కనీస మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు కూడా లేకపోవడాన్ని అధికారులు కనుగొన్నారు. అదేవిధంగా, మాదాపూర్ లోని ఐడియల్ కిచెన్ లో తనిఖీలు చేయగా తీవ్ర నిరక్ష్యం వెలుగుచూసింది. అక్కడి ఫ్రీజర్లలో నిల్వ ఉంచిన పిండివంటలపై బొద్దింకలు తిరుగుతుండటం, వంటకు ఉపయోగించే మినపప్పులో పురుగులు ఉండటాన్ని అధికారులు గమనించారు. ముడి పదార్థాల నిల్వలోనూ తీవ్ర లోపాలు బయటపడటంతో ఈ సంస్థకు 67 శాతం హైజీన్ స్కోర్ ఇచ్చి నోటీసులు అందజేశారు. మరోవైపు కొండాపూర్ లోని పాలమూరు గ్రిల్ లో ఆహార పదార్థాల లేబుల్ ట్యాంపరింగ్ చేయడంతో పాటు, గడువు ముగిసిన మష్రూమ్స్ (పుట్టగొడుగులను) నిల్వ చేసినట్లు అధికారులు పట్టుకున్నారు. వంటగది అంతా ఈగలతో నిండిపోవడమే కాకుండా, అక్కడి ఫ్రీజర్లు తుప్పుపట్టి పోయి ఉన్నాయి. అధికారులు అక్కడికక్కడే పాత, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను పారవేయించారు. ఈ రెస్టారెంట్‌కు అత్యంత తక్కువగా కేవలం 60 శాతం హైజీన్ రేటింగ్ మాత్రమే దక్కింది. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటూ, కనీస నిబంధనలు పాటించని ఇటువంటి సంస్థలపై భవిష్యత్తులో మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ అధికారులు తీవ్రంగా హెచ్చరించారు.





ఐటీ కారిడార్ పరిధిలో రెస్టారెంట్లలో అపరిశుభ్రంగా ఉన్న వంటశాలల దృశ్యం, తనిఖీ చేస్తున్న అధికారులు





# గృహప్రవేశం ఇంట్లో గంజాయి గ్యాంగ్ బీభత్సం

**బంధువులపై దాడి, ఇద్దరు అదుపులోకి..**

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త :** ఆ ఇంట గృహప్రవేశ వేడుక జరిగి, పగలంతా బంధుమిత్రుల రాకతో ఇల్లంతా ఎంతో కోలాహలంగా సాగింది. కానీ సాయంత్రానికి ఊహించని దారుణం జరిగింది. ఎలాంటి గొడవలు లేకపోయినా ఓ గంజాయి గ్యాంగ్ ఆ ఇంటిపై దాడికి తెగబడి, పండగ వాతావరణాన్ని కాస్తా భయానకంగా మార్చేసింది. ఈ అమానుష ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం... బోడుప్పల్ దేవేందర్ నగర్‌లో ఓ కుటుంబం కొత్తగా నిర్మించుకున్న ఇంట్లోకి బంధువులను ఆహ్వానించి ఘనంగా గృహప్రవేశం వేడుకను నిర్వహించుకుంది. అయితే, స్థానికంగా గంజాయి ముఠా నాయకుడిగా పేరున్న జెన్న రాజు, అతని అనుచరులు కొందరు గంజాయి మత్తులో రాత్రి సమ యంలో ఆ ఇంటిపై ఒక్కసారిగా దాడికి దిగారు. అడ్డువచ్చిన ఇంటి యజ మానితో పాటు వేడుకకు వచ్చిన బంధువులపై కూడా విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. చివరకు ఈ దారుణాన్ని మొబైల్‌లో వీడియో తీస్తున్న వ్యక్తిని కూడా వదలకుండా అతనిపైనా దాడికి పాల్పడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే మేడిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూసి దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గంజాయికి బానిసలైన ఈ ముఠా కాలనీల్లో తరచూ గొడవలు సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తోందని పోలీసులు తెలిపారు. ఈ గ్యాంగ్ లీడర్ జెన్న రాజుపై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయని వెల్లడించారు. ఈ దాడి ఘటనపై మేడిపల్లి సీఐ జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ... "పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నాం. దాడికి పాల్పడిన వారిలో ఇప్పటివరకు 8 మందిని గుర్తించాం, ఇద్దరిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నాం. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాం. వీరి ఆగడాలు మితిమీరితే అవసరమైతే రౌడీషీట్ కూడా తెరుస్తాం" అని స్పష్టం చేశారు.



బాలాపూర్‌లో ప్రతిష్టించిన బొడ్రాయికి పూజలు చేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

# బొడ్రాయికి బోనమెత్తి..

**ప్రతిష్టాపనోత్సవంలో సబిత**

**సరూర్‌నగర్, జూన్ 28 ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక విశ్వాసాలు, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని బాలాపూర్ గ్రామంలో జరిగిన బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవం సందర్భంగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తిప్రపత్తులతో ప్రతిష్టించిన బొడ్రాయికి ఆమె తన కుమారుడు, యువ నేత పట్లోళ్ళ కౌశిక్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతకు దోహదపడతాయని అన్నారు. ఆధ్యాత్మికతకు సంబంధించిన సాంప్రదాయాలను కొనసాగించడం ద్వారా వాటిని పరిరక్షిస్తూ భావి తరాలకు అందించినట్లవుతుందని అన్నారు. బొడ్రాయి దేవత ఆశీస్సులతో గ్రామస్తులు సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బొడ్రాయి కమిటీ ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాగా బొడ్రాయి ప్రతిష్టాపన జరిగిన సందర్భంగా ఆదివారం బాలాపూర్‌లో బొడ్రాయి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో బోనాలను జరుపుకున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుండి మహిళలు బోనం కుండలతో తరలివచ్చి బొడ్రాయికి సమర్పించారు. బొడ్రాయి బోనాల నేపథ్యంలో బాలాపూర్ గ్రామస్తుల ఇళ్లకు బంధు, మిత్రులు రావడంతో గ్రామం సందడిగా సాగింది. గ్రామంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. గ్రామంలో వాహనాలను నిలపడానికి స్థలం సరిపోకపోవడంతో గ్రామ సరిహద్దుల్లో, ఆర్‌సిఐ రోడ్డులో వందలాది కార్లు, ఇతర వాహనాలను పార్కు చేయాల్సిన పరిస్థితి కలిగింది.

## రూ. 12లక్షల లాకర్ మాయం

**జూబ్లీహిల్స్, జూన్ 28, ప్రభాతవార్త :** జైన్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో రూ. 12 లక్షల నగదుతో కూడిన లాకర్ మాయం కావడం పట్ల బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లో జైన్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయం ఉంది. కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేసే కొమ్మగాని బిక్ష పతి శనివారం ఉదయం కార్యాలయానికి వెళ్లి మేనేజర్ కార్యాలయంలో గమనించగా కార్యాలయంలో పెట్టిన రూ. 12.33లక్షలతో కూడిన గోద్రేజ్ లాకర్ కనిపించలేదు. కార్యాలయంలో పనిచేసే ఆఫీస్ బాయ్ ఫణీంద్ర కార్యాలయానికి రాకపోవడంతోపాటు ఫోన్ చేసినా స్పందించడం లేదు. దీనికితోడు లాకర్‌తో వెళ్లడాన్ని సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. ఈ సంఘటనపై బిక్షపతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అర్ధరాత్రి ఆసుపత్రిలో మహిళ హల్‌చల్..

- కడుపునొప్పితో వచ్చిన బాధితురాలికి ప్రాథమిక చికిత్స
- ఎలాంటి అనారోగ్య సమస్య లేదని నిర్ధారించిన వైద్యులు
- ఒక్కసారిగా తీవ్ర ఆగ్రహంతో సిబ్బందిపై దాడి
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** నగరంలోని ఎల్బీ నగర్‌లో శనివారం అర్ధరాత్రి ఓ మహిళ ఆసుపత్రి సిబ్బందిపై దాడికి దిగడం తీవ్ర కలకలం రేపింది. కడుపునొప్పితో బాధపడుతున్నానంటూ వచ్చిన సదరు మహిళ, వైద్యులపై ఆగ్రహంతో ఊగిపోతూ ఈ దారుణానికి ఒడిగట్టింది. వివరాలలోకి వెళితే.. లలిత కరీర అనే మహిళ శనివారం రాత్రి కడుపునొప్పిగా ఉందంటూ ఎల్బీనగర్‌లోని శ్రేష్ఠ ఆరెంజ్ హాస్పిటల్ అత్యవసర విభాగానికి వచ్చింది. బాధితురాలిని పరిశీలించిన వైద్యులు ఆమెకు ప్రాథమిక చికిత్స అందించి, అవసరమైన పలు పరీక్షలు నిర్వహించారు. అయితే, పరీక్షల నివేదికల అనంతరం ఆమెకు ఎలాంటి అనారోగ్య సమస్య లేదని వైద్యులు నిర్ధారించారు. ఇదే విషయాన్ని ఆమెకు స్పష్టం చేయడంతో లలిత కరీర ఒక్కసారిగా తీవ్ర ఆగ్రహానికి గురైంది. వైద్య సిబ్బందిని బూతులు తిడుతూ, వారిపై భౌతిక దాడికి పాల్పడింది. అనంతరం ఆమె అక్కడి నుంచి తన కారును స్వయంగా నడుపుకుంటూ వనస్థలిపురంలోని సహారా హాస్పిటల్‌కు వెళ్లిపోయింది. ఈ ఊహించని ఘటనతో దిగ్భ్రాంతికి గురైన ఆసుపత్రి యాజమాన్యం వెంటనే ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. లలిత కరీరపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆమె వైద్యులపై అంత తీవ్రంగా ఎందుకు ప్రవర్తించాల్సి వచ్చింది అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## కన్సల్టింగ్ సంస్థ తీరుతో.. యువతికి యూకే పదేళ్ల బహిష్కరణ

**జూబ్లీహిల్స్, జూన్ 28, ప్రభాతవార్త:** యూకే వీసా ఇప్పిస్తామని రూ. 31.42లక్షలు మోసగించిన ఒక సంస్థ ప్రతినిధులపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిల్మ్‌నగర్‌లో నివసించే దీపిక యూకేకు వెళ్లేందుకు జూబ్లీహిల్స్‌లోని ఆరెన్ ఓవర్సీస్ కన్సల్టెన్సీని సంప్రదించింది. సంస్థ ప్రతినిధులైన దీప్తి, రూఫస్ వేలేటిలు ఆమెకు యూకే స్కిల్డ్ వర్కర్ వీసా ఇప్పిస్తామని హామీనిచ్చారు. దీనికితోడు వీసా ప్రాసెసింగ్, సర్టిఫికేట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్(సీఓఎస్) పేరుతో మొత్తం రూ. 31.42లక్షలు వసూలు చేశారు.

సంస్థకు ఉన్న చరిత్రను దాచిపెట్టి ఆమె వీసాను దాఖలు చేయగా వీసా తిరస్కరణకు గురైంది. ఈ విషయాన్ని దాచిపెట్టి దాదాపు రెండు నెలల తరువాత ఆమెకు తెలిపారు. దీంతో ఆమె వీసా తిరస్కరణకు గురికావడంతోపాటు దాదాపు పదేళ్లపాటు యూకేలోకి ప్రవేశించకుండా నిషేధం విధించారు. ఈ సంఘటనతో తనకు రూ. 31.42 లక్షల ఆర్థిక నష్టంతోపాటు తన ఇమ్మిగ్రేషన్ రికార్డు దెబ్బతిందనవి, భవిష్యత్తులో విదేశీ ఉద్యోగ అవకాశాలు కోల్పోయానని ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు ఆరెన్ సంస్థ ప్రతినిధులైన దీప్తి, రూఫస్ వేలేటిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హైడ్రా ముసుగులో పేదల ఇళ్లు కూల్చితే ఖబడ్దార్

**బేగంపేట జూన్ 28,ప్రభాతవార్త :** బోయిన్‌పల్లి అస్మత్ పేట గ్రామంలోని సర్వే నెంబర్ 1 భూమి చుట్టూ జరుగుతున్న పరిణామాలు నిరుపేదల గుండెల్లో ఆందోళణ నింపుతున్నాయని, హైడ్రా ముసుగులో పేదల ఇళ్లు కూల్చితే ఖబర్ధార్ అంటూ మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ హెచ్చరించారు. దశాబ్దాలుగా హమాలీలు,ఆటో డ్రైవర్లు, ఇళ్లలో పనిచేసే నిరుపేదలు తమ రక్తాన్ని చెమటగా మార్చి తక్కువ ధరకు వస్తుందని నమ్మి ఇక్కడ 50,60గజాల స్థలాలు కొనుక్కొని తలదాచుకుంటున్నారని అన్నారు. హఠాత్తుగా ఆ భూమిని ఆర్కియాలజీ స్థలం, ప్రైవేటు భూమి అనే సాకులు చెబుతూ పేదల ఇళ్లను కూల్చేందుకు పూనుకోవడం దుర్మార్గమని ఆక్షేపించారు. ఆనాడు కళ్లముందే దొంగతనంగా లే అవుట్లు చేస్తున్నపుడు ఈ నిబంధనలు అధికారులకు ఎందుకు గుర్తుకు రాలేదు. దమ్ముంటే లే అవుట్ వేసిన దొంగలపై చర్యలు తీసుకోండి అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోండి.పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తామంటే చూస్తూ ఉరుకునేది లేదని హెచ్చరించారు.బ్రోకర్లు,పెద్ద కబ్జాదారుల చేతుల్లో ఉన్న వందల ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని అందులో పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేసారు.నిరుపేదలను రోడ్డున పడవేసే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారు అని ఆయన ప్రశ్నించారు.శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసు వ్యవస్థ, కబ్జాదారులను, గూండాలను నియంత్రించాల్సింది పోయి పేదల ఇళ్లను కూల్చివేసేందుకు అధికారులకు అండగా నిలవడం శోచనీయమన్నారు. అస్మత్ పేట భూముల లే అవుట్ల వెనుక ఉన్న రాజకీయ నాయకులను, అనుమతులు ఇచ్చిన అధికారులను తక్షణమే జైల్లో పెట్టాలని డిమాండ్ చేసారు. 60గజాల స్థలాలు కొనుగోలు చేసిన పేదలకు వెంటనే రెగ్యులరైజ్ చేయాలని స్పష్టం చేసారు. అలాగే కంటోన్మెంట్ 57,157సర్వే నెంబర్లలోని వివాదాస్పద భూముల్లో ప్రభుత్వం లేఅవుట్లకు అనుమతులు ఇచ్చిందని,రేపు వచ్చే ప్రభుత్వం దాన్ని రద్దు చేసే అవకాశం ఉందంటూ పేద ప్రజలెవరూ ఇలాంటి వివాదాస్పద భూములు కొని మోసపోవద్దని ఈసందర్భంగా ఈటెల రాజేందర్ ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏనుగుల తిరుపతి,అజిత్‌సింగ్,శేఖర్,రమేష్,వరుణ్ పెద్ద సంఖ్యలో (బాధితులు) స్థానికులు పాల్గొన్నారు.



బోయిన్‌పల్లి అస్మత్ పేటలో నిరుపేదలకు భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపి ఈటెల రాజేందర్



ఎస్.ఐ.ఆర్.సర్వేను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత శ్రీనాథ్

## ఎస్.ఐ.ఆర్.సర్వేపై ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి

**కంటోన్మెంట్, జూన్ 28 ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు దాటిన యువతీ, యువకుల పేర్లను తప్పని సరిగా ఓటర్ జాబితాలో నమోదు చేయించుకోవాలని, మరణించిన వారి పేర్లను తొలగించాలని రెజిమెంటల్ బజార్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనాథ్ సూచించారు.ఆదివారం ఆదివారం మోండా డివిజన్‌లోని బూత్ నెం 205 నిర్వహించిన ఎస్.ఐ.ఆర్.సర్వేలో ఆయన పాల్గొని ఆయన పలు సూచనలుచ్చారు.



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాయకులు

## బిఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

**సంజీవరెడ్డి నగర్, జూన్ 28, ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) వీరబాబు, సుధాకర్, మహేందర్‌లతో కలిసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు అమీర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ అధ్యక్షుడు ఎం. హనుమంతరావు ఆధ్వర్యంలో బూత్ నంబర్లు 154, 155 పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఓటరును కలిసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వివరాల మ్యాపింగ్ నిర్వహించి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేశారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సకాలంలో ఫారాలు సమర్పించాలని నాయకులు సూచించారు. ఓటరు జాబితా సక్రమంగా రూపొందించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లేష్ గౌడ్, కూతురు నరసింహ, కట్ట బలరాం, శ్రవణ్, అరుణతో పాటు ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు

**చార్మినార్, జూన్ 28 ప్రభాతవార్త :** విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని,బాలికలు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని బహదూర్‌పుర మండలం తహసీల్దార్ కె.బాల శంకర్ అన్నారు.పాతబస్తీ దూద్‌బౌలి ఆశ్రిత హోమ్‌లో జరిగిన కమ్యూనిటీ బేసిడ్ కేర్ కార్యక్రమంలో తహసీల్దార్ బాల శంకర్ పాల్గొన్నారు.ఆశ్రిత హోమ్‌కు చెందిన బాలికల తల్లిదండ్రులకు ఆయన నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రిత హోమ్‌కు అన్ని విధాల సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రిత హోమ్ డైరెక్టర్ నాగరాజు, ప్రోగ్రామ్ మేనేజర్ వి.పర్వతాలు, ప్రతినిధులు స్వాతి, శిరీష, శేఖర్, అనిత, శ్రీతో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, బాల కార్మికుల వ్యవస్థ గురించి కార్యక్రమంలో వివరించామని ప్రోగ్రాం మేనేజర్ పర్వతాలు తెలిపారు.

## అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి అన్నప్రసాద వితరణ

**సికింద్రాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ, పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రుల వద్ద ఆదివారం సుమారు 300 మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు. గత పదేళ్లుగా సామాజిక,ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలతోపాటు పలు ప్రభుత్వాస్పత్రుల వద్ద అన్నార్తులు, అభాగ్యులు, రోగి సహాయకులకు అన్నదానం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వెనస్ ఎంటర్ప్రైజెస్,భవాని గ్యాల్వనైజింగ్ సంస్థల అధినేతలు వేణుగోపాల్‌గురుస్వామి, కళ్యాణచక్రవర్తిలు ముఖ్యఅతిథులుగా హాజరై అన్నప్రసాద వితరణ నిర్వహించారు. చింతల్ అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి అధ్యక్ష కార్యదర్శులు టి.వెంకటేష్ (బొంబాయి గురుస్వామి), పుల్లారావు, టైలర్ కేవీ రాజేంద్ర ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్, సభ్యులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, తిరుపతి, రామకృష్ణ, దేవానంద్, సాయిమణికంఠ, నాగయశస్వికేసన, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పివి జయంతి వేడుకల్లో మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్

## పివి సేవలు చిరస్మరణీయం

**జూబ్లీహిల్స్, జూన్ 28, ప్రభాతవార్త:** భారత మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు దేశం గర్వించదగ్గ వ్యక్తని ఖైరతాబాద్ నియోజకవర్గ నాయకుడు, సోమాజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ పేర్కొన్నారు. పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్కరణకు ఆజ్యం పోసి దేశ ఆర్థికాభివృద్ధిని గాడిన పెట్టిన వ్యక్తి పీవీ అన్నారు. తెలంగాణ గడ్డ మీద జన్మించి దేశం కోసం సేవలందించిన ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

## 2న ఉప్పల్‌లో టిఆర్ఎస్ భారీ బహిరంగసభ

**ఉప్పల్, జూన్ 28 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో జూలై 2వ తేదిన మిలియన్ మార్చ్ తరహాలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ సర్వే వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల కోసం జూలై 2వ తేదిన భూపోరాటం చేస్తామని తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద దాడి చేస్తున్నారని, పవన్ కళ్యాణ్‌పై ఇంత వరకు కేసు పెట్టలేదని విమర్శించారు. సినిమాను కూడా అవమానం చేస్తున్నారని విమర్శించారు. ఆంధ్ర వాళ్లతో ఉన్న వ్యాపార సంబంధాల కారణంగా కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకోవం లేదని ఆరోపించారు. కార్పొరేట్ కళాశాల నిర్వహకులకు విజయ డైరీ నుంచి పాలు కొనుగోలు చేయాలని, దీని వల్ల పాడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఉద్యమంలో పాల్గొన్న వారిపై కేసుల ఎత్తివేత, గుర్తింపు కార్డులు, గౌరవ భృతివంటి హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు.

# ప్రణాళికా రహిత నిర్మాణాలే ముంపునకు కారణం

### రౌండ్ టేబుల్ సమావేశంలో ఆందోళన

**చిక్కడపల్లి జూన్ 28 ప్రభాతవార్త:** నగరంలో మున్సిపల్ చట్టాలకు విరుద్ధంగా, ప్రణాళికారహితంగా ఇస్తున్న నిర్మాణ అనుమతుల వల్లే వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడి వరద ముంపునకు దారితీస్తోందని అర్బన్ పాలసీ నిపుణులు డాక్టర్ దొంతి నరసింహారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాదులో వరద నీటి కష్టాలు ప్రభుత్వ సన్నద్ధత.. అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. డాక్టర్ దొంతి నరసింహారెడ్డి మాట్లాడుతూ మెట్రో రైల్ పిల్లర్ల మధ్య చేపట్టిన నిర్మాణాలు కూడా వరదలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్లే రోడ్లు, ఫ్లైఓవర్లు కాల్వలను తలపిస్తున్నాయని మండిపడ్డారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద తగిన చర్యలు చేపట్టడంలో, వాటర్ షెడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణంలో అధికార యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. పర్యావరణ మార్పులు, హీట్ ఐలాండ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రణాళికలను సవరించాలని, వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేవలం అధికారులతోనే కాకుండా, నగర సమస్యలపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు, పర్యావరణవేత్తలు, సంక్షేమ సంఘాలతో ముఖ్యమంత్రి తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ లుబ్నా సర్వత్ మాట్లాడుతూ బంజారాహిల్స్ లోని వరద నీరు పల్లానికి ప్రవహించి చేరే ఏనుగుల కుంటలో ప్రస్తుతం పార్కు నిర్మించడం వల్లే ఆ నీరంతా రోడ్లు, ఇళ్లలోకి వస్తోందని విమర్శించారు.

హైడ్రా కేవలం చెరువుల సుందరీకరణకే ప్రాధాన్యం ఇస్తోందని, వాటి విస్తీర్ణం, లోతు పెంచడంపై దృష్టి పెట్టడం లేదని అన్నారు. ప్రతి డబుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్ వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎం. శ్రీనివాస్ ఈ చర్చాగోష్టికి హెచ్.సి.ఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. వీరయ్య అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షులు మల్లం రమేష్, ఎం. శ్రీనివాసరావు , హెచ్.సి.ఎఫ్ నగర నాయకులు పి. శ్రీనివాసరావు, రాజమౌళి, డి. సైదులు, సంగీత, శ్వేత, కే. రమేష్, సుకుమార్, గోపాల్, నాగేష్, శంకరయ్య, రింగ్ సైదులు, మోహన్, ఆర్.ఐ. బాబు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ పాలసీ నిపుణులు డాక్టర్ దొంతి నరసింహారెడ్డి

## గ్యాస్ కట్టర్‌లతో డోర్లు తెరిచి చోరీ

**సికింద్రాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** ముసుగులు ధరించిన దుండగులు సెక్యూరిటీ గార్డులను కత్తులతో బెదిరించి మోకాళ్లపై కూర్చోబెట్టారు.. గ్యాస్ కట్టర్‌తో తలుపులు తెరచి లోనికి చొరబడి నగదు అపహరించి పరారైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుబాబులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్టకు చెందిన సతీష్‌కుమార్ పద్మారావునగర్‌లో నాలుగు అంతస్థుల భవనంలో జ్యోతి మెడికల్ హాలు పేరిట హోల్‌సేల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రిటైల్ మెడికల్ షాపులు, ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా చేస్తుంటాడు. ఈనెల 27వ తేది రాత్రి 10.30 గంటలకు వ్యాపార పనులు పూర్తి చేసుకున్న సిబ్బంది కార్యాలయానికి తాళం వేసి వెళ్లి పోయారు. ఇరువురు సెక్యూరిటీగార్డులు కాపలా ఉంటున్నారు. ఈ క్రమంలో 28వ తేది వేకువజాము 3.20 గంటలకు ముసుగులు ధరించిన ఎనిమిది మంది అగంతకులు జ్యోతి మెడికల్ హాలు భవనం వద్దకు చేరుకున్నారు. విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డులను కత్తులతో బెదిరించి, సెల్‌ఫోన్లు లాగేసుకుని, మెట్లపై మోకాళ్లపై కూర్చోబెట్టారు. వెంట తెచ్చుకున్న గ్యాస్ సిలిండర్, కట్టర్ ఇతర పనిముట్లతో కార్యాలయ గదుల తలుపులు తెరిచారు. నాల్గవ అంతస్థులో ఉన్న క్యాష్‌కౌంటర్ తాళాలు బద్ధలు కొట్టి రూ. 27,500 నగదు అపహరించారు. సుమారు గంట సమయం పాటు అన్నిగదులు కలయతిరిగినా ఏమి దొరకలేదు. తిరిగి వెల్తున్న సమయంలో సెక్యూరిటీ గార్డుల వద్ద ఉన్న రూ.2,500 నగదు తీసేసుకున్నారు. ఎవరికైనా చెబితే చంపేస్తామంటు బెదిరించి క్షణాల్లో పరారయ్యారు. సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితకృష్ణమూర్తి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డిలు ఘటనస్థలానికి చేరుకుని, సెక్యూరిటీగార్డులతో మాట్లాడి నేరం జరిగిన తీరుతెన్నులను తెలుసుకున్నారు. జ్యోతి మెడికల్ హాలు యజమాని సతీష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, నేరస్థులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాల ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టామని ఏసీపీ శశాంక్‌రెడ్డి తెలిపారు.

## 10న రెడ్డి ఉమెన్స్ కాలేజీ స్నాతకోత్సవం

**హైదరాబాద్, జూన్ 27 ప్రభాతవార్త :** రాజా బహదూర్ వెంకట రామారెడ్డి మహిళా కళాశాల 15వ స్నాతకోత్సవం జూలై 10వ తేదీన నారాయణగూడలోని కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అచ్యుతదేవి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ ఎం.ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి. మంజుల, వైస్ ప్రిన్సిపల్ సిందూరిలతో కలిసి ప్రిన్సిపాల్ స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన 302 మంది విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు. చదువులో అత్యుత్తమంగా రాణించిన 17 మంది విద్యార్థినీలకు స్వర్ణ పతకాలను అందించనున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవ వేడుకలకు మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ బి. సుమతి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ గౌరవ అతిధిగా పాల్గొంటారని తెలిపారు.

## బాలాపూర్ పోలీసుల అకృత్యాలపై విచారణ జరపాలి

**సైఫాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కిరాతక హింస, యువకులపై లైంగిక దాడులు, బ్లాక్ మెయిల్ చేస్తున్న ఎస్ఐ ప్రసాద్, సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డిజిపికి పౌర హక్కుల ప్రజా సంఘం (పియుసిఎల్) డిమాండ్ చేసింది. లేని పక్షంలో అన్ని ప్రజా, పౌర హక్కుల సంఘాలతో కలిసి ఉద్యమం చేపడతామని, సోమవారం సిఎం, డిజిపి, డిసిపి, ఎసిపిలకు వినతి పత్రాలు అందజేస్తామని పియుసిఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవింధ్యాల చెప్పారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో బాధితుల, వారి భార్యలు, పిల్లలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహ్మద్ జహంగీర్, మహ్మద్ అబ్దుల్లా అనే అన్నదమ్ములు వారి భార్యలు, పిల్లలతో కలిసి జీవిస్తున్నారని చెప్పారు. కాగా వీరి సోదరుడైన అసద్ పేరును పోలీసులు రౌడీషీట్‌లో చేర్చి నగర బహిష్కరణ చేశారని, ఈ కారణంతో బాలాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ప్రసాద్ వారిపైన కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. ఈ నెల 23వ తేదీ రాత్రి 11.30 గంటలకు ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సివిల్ డ్రస్‌లో ఉన్న పోలీసులు అబ్దుల్లాను ఇంటి నుంచి బయటకు పిలిపించి కారులో ఎక్కించుకుని కొట్టడం ప్రారంభించారని, అప్పటికే జహంగీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ఈ ఇద్దరిని బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్ళి డార్క్ రూమ్‌లో ఉంచి బట్టలు విప్పి నగ్నంగా ఉంచారని ఆమె ఆరోపించారు. వారిని పోలీసులు రబ్బరు, ప్లాస్టిక్ రాడ్లుతో కొట్టారని, అంతేకాకుండా ప్రైవేటు భాగాలపై తీవ్రంగా కొట్టడమే కాకుండా ఎర్ర కారాన్ని వారి ప్రైవేటు భాగాల్లో పెట్టి చిత్ర హింసలకు గురిచేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత అమానవీయంగా గుప్తాంగాలను నోట్లో పెట్టి పిల్చుకునేలా (ఒరల్ సెక్స్) చేయించాని, ఆ సమయంలో వీడియోలు తీసి, వాటిని ఇతర రౌడీలకు చూపించి బ్లాక్ మెయిల్ ప్రయత్నం చేశారని ఆమె ఆరోపించారు. వారిని పోలీసులు 24వ తేదీ తెల్లవారు ఝామున పోలీస్ స్టేషన్ నుంచి బయటకు పంపడం జరిగిందన్నారు. పోలీసులు అబ్దుల్లా వద్ద నుంచి 40 రూపాయలు, మొబైల్ ఫోన్, ఆధార్ కార్డును గుంజుకున్నారని, దీంతో వారు ఆరు నెలల పసిపాపతో ఇల్లు విడిచి పోయి జీవిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఏ నేరం చేయని వారిని పోలీసులు ఎందుకు హింసిస్తున్నారని, వారి సోదరుడు అసద్‌ను నగర బహిష్కరణ చేసిన పోలీసులకు అతను ఎక్కడున్నాడో పోలీసులకే తెలుస్తుందని, వారి సోదరులకు తెలియదన్నారు. ఎస్ఐ ప్రసాద్‌తోపాటు హింసలో పాల్గొన్న పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని, వారిపైన ఐపిసి 376/377, 324, 330 కేసులు నమాదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**చాంద్రాయణగుట్ట, జూన్ 28, ప్రభాతవార్త :** టీజీఎస్‌పీడీసీఎల్ ఫలక్‌నుమా సిబిడి, ఛత్రినాక సెక్షన్ పరిధిలోని చెట్ల కొమ్మల కత్తిరింపు కారణంగా ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంత రాయం కలుగుతుందని అధికారులు వెల్లడించారు. ఛత్రినాక ఫీడర్‌లోని ఛత్రినాక, బోయిగూడ, శ్రీరాంనగర్, మగ్ధుంపురా, గౌలిపురా, మురాద్ మహల్, బాలాగంజ్, లాల్‌దర్వాజా, జీ.ఎం.చావునీ ఫీడర్‌లోని జిఎం చావునీ, ఛత్రినాక, కందికల్‌గేట్, వివినగర్, అయోధ్యనగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 9గంటల నుండి 12 గంటల వరకు నిలిపివేస్తామన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎసిపి శంకరరాజు

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలి

**బేగంపేట, జూన్ 28, ప్రభాతవార్త :** మాదక ద్రవ్యాల మహమ్మారిని నిర్మూలించడంలో పౌర సమాజం చేయూత ఎంతో అవసరం అని మల్కాజ్ గిరి కమీషనరేట్ తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ పీ.జీ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్ధాలు,నిర్మూలన పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న శంకరరాజు మాట్లాడుతూ యువత మత్తుకు బానిసలు అవుతున్నారని,ఎక్కువగా వివిధ రకాల స్నేహాల వల్ల డ్రగ్స్‌కు ఆకర్షితులవుతూ వారి భవిష్యత్‌ను ప్రశ్నార్ధకం చేసుకుంటున్నారని,ఇది దేశ ఆర్థిక పైన కూడా ప్రభావం పడుతుందని ఆయన అభిప్రాయ పడ్డారు. చెడు మార్గాలను అనుసరిస్తూ మేధా శక్తిని కోల్పోతున్నారన్నారు. పోలీసులతో పాటు తల్లి దండ్రులు,పౌరసమాజం సహకారం అందించి వారిని చెడు నుంచి సక్రమమైన మార్గంలో పయనింపజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాస్, వేలాద్రి, రామస్వామి, రాంచందర్, సమీర్, బాబ్జీ, రాజ్యలక్ష్మి, సురేష్,కాంచన, పి.జి.డిహెచ్‌ఆర్ విద్యార్థులు పాల్గొన్నారు.



పద్మారావుకు నివాళులు అర్పిస్తున్న నారాయణ

## ఉద్యమంలో పద్మారావు పాత్ర కీలకం

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 28, ప్రభాతవార్త :** తెలంగాణ తొలి మలిదశ ఉద్యమంలో గొట్టిముక్కల పద్మారావు కీలక భూమికను పోషించారని తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ కొనియాడారు. తెలంగాణ ఉద్యమ నాయకులు, ప్రముఖ సినీ నిర్మాత, సీనియర్ రాజకీయ నాయకుడు దివంగత గొట్టిముక్కల పద్మారావు ఇటీవల అకాల మరణం చెందిన విషయాన్ని తెలుసుకున్న అల్లం నారాయణ, ఆంధోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్, సంగారెడ్డి జిల్లా మునిపల్లి మాజీ జడ్పిటిసి సాయికుమార్ తదితరులు పద్మారావు నివాసానికి వెళ్లి ఆయన చిత్ర పటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ కూకట్‌పల్లి ప్రాంతం నుండి తెలంగాణ ఉద్యమంలో గొట్టిముక్కల పద్మారావు ప్రత్యక్షంగా పాల్గొని ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. సినీ నిర్మాతగా ఉద్యమ నేతగా, కూకట్‌పల్లి ప్రాంత సీనియర్ నాయకులుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి స్థానిక ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని అల్లం నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల పాండురంగారావు, వెంకటేశ్వరరావు, సృజన, టియుడబ్ల్యూజే నాయకులు ఆర్కే దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్, కోహీర్ నాగరాజ్ యాదవ్, రాజు యాదవ్, మేకల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ డివిజన్ ఇంఛార్జిల నియామకం

**జూబ్లీహిల్స్, జూన్ 28, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) చేపట్టింది. ఇందులో భాగంగా కృష్ణానగర్‌కు అబ్దుల్ రజాక్ ఖాన్ అలియాస్ ఫిరోజ్, ఏజీ కాలనీకి ఎ. మనోజ్ కుమార్ యాదవ్, ఎర్రగడ్డకు సయ్యద్ నయీముద్దీన్, వెంగళరావు నగర్‌కు పి. శౌరి రాజు, శ్రీనగర్ కాలనీకి ఎం.ఎ. మజీద్, యూసుఫ్‌గూడకు దేవులపల్లి సంపత్ కుమార్, రహ్మత్ నగర్ డివిజన్‌కు గ్యార నాగరాజు, కార్మిక నగర్ డివిజన్‌కు పి. ఆండాలు, రాజీవ్ నగర్‌కు బి. వీర రాఘవ చౌదరి, బోరబండ డివిజన్‌కు ఆనంద్ కుమార్, షేక్‌పేట్‌కు సయ్యద్ షా ముబషీరుద్దీన్ అలియాస్ సయ్యద్ అఫ్రోజ్‌లను నియమిస్తున్నట్లు సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. దీపక్ జాన్ స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన డివిజన్ అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ సంస్థను మరింత బలోపేతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

## ఈతకు వెళ్లిన బాలుడు మృతి..

**కొంపల్లి, జూన్ 28, ప్రభాతవార్త :** బైరుని చెరువులోకి ఈతకు వెళ్లిన ఓ బాలుడు మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్ గాంధీ నగర్ రోడ్ నెం.1కు చెందిన శ్రీను కుమారుడు ఏ. సాయి చరణ్ (13), స్థానిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి బైరుని చెరువులో ఈతకు వెళ్లగా, అనుకోకుండా లోతైన ప్రాంతంలోకి వెళ్లి నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అతడిని బయటకు తీసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ మాదిగ

## 7న మాదిగల పుణ్యక్షేత్ర శంకుస్థాపన మహోత్సవం

**సైఫాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) ఈదుమూడి గ్రామంలో ఆవిర్భవించి 32 సంవత్సరాలు అయిన సందర్బంగా అక్కడ జులై 7న మాదిగల పుణ్యక్షేత్ర శంఖుస్థాపన మహోత్సవం నిర్వహిస్తున్నామని సమితి నాయకులు తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి జాతీయ అధ్యక్షుడు డా.నంద్రు సరసింహారావు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు చిటుపాక ప్రభాకర్‌మాదిగ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర మంత్రి కె.హెచ్.మునియప్ప, తెలంగాణ రాష్ట్ర మంత్రి అండ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎఐసిసి ఎస్సీ విభాగం ఛైర్మన్ రాజేంద్రపాల్ గౌతమ్, పార్లమెంట్ సభ్యుడు శశికాంత్ సెంథిల్, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని, రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ నాగరిగారి ప్రీతం తదితరులు పాల్గొంటారని చెప్పారు. 32 సంవత్సరాల వర్గీకరణ ఉద్యమంలో ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని, వారి స్మరించుకుంటూ ఈ పుణ్యక్షేత్రంలో మాదిగల అమర వీరుల స్తూపంకు శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## మద్యం మత్తులో కారుకు ఢీ ..

**జూబ్లీహిల్స్, జూన్ 28, ప్రభాతవార్త:** మద్యం మత్తులో వాహనంలో వేగంగా వచ్చి ఒక విశ్రాంత మహిళ నడుపుతున్న కారును ఢీకొట్టిన యువకుడిపై ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. సైనిక్‌పురి ప్రాంతానికి చెందిన విశ్రాంత ఉద్యోగి మనోజ్ఞరెడ్డి జూబ్లీహిల్స్‌లోని అపోలో క్రెడిల్ ఆసుపత్రి వైపు నుంచి తన కారులో వస్తుంది. అదే సమయంలో ఎంజీ ఆస్టర్ కారు(హెచ్‌ఆర్ 98డి 4199) నంబరులో వచ్చిన ఒక యువకుడు వేగంగా వచ్చి ఆమె కారును ఢీకొట్టడంతో ఆమె కారు దెబ్బతింది. కారు నడుపుతున్న వ్యక్తిని ఫిల్మ్‌నగర్ ఠాణాకు తీసుకెళ్లగా అతన్ని గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన అఖిల్(29)గా గుర్తించారు. అతనికి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా రక్తంలో మద్యం మోతాదు శాతం 72 ఎంజీ ఉన్నట్లు తేలింది. దీంతో పోలీసులు అతని వద్ద నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉచిత వైద్య సేవలు అభినందనీయం

**జీడిమెట్ల, జూన్ 28, ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని చింతల్ 282వ డివిజన్ శ్రీనివాస నగర్ కాలనీ సమీపంలో నిర్వహించిన 48వ ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ఆదివారం సందర్శించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో అభినందనీయమైన కార్యక్రమమని అన్నారు. ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సూచనలు, ఉచిత మందులు అందజేశారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె. పృథ్వీరాజ్, ఫలూర్ రెహమాన్, వెంకటేష్ (బిల్లా), జగన్, సాధు యాదవ్, గజ, సింధేష్, మనోజ్, చెన్నమ్మ, నాగమణి, స్వప్న, కమల, సాయిబాబు, 282వ డివిజన్ శ్రీనివాస నగర్ కాలనీవాసులు, టీమ్ బీకేఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## భక్తిప్రపత్తులతో బడాపంజా ఊరేగింపు

**చాంద్రాయణగుట్ట, జూన్ 28, ప్రభాతవార్త :** మొహర్రం పండుగ నేపథ్యంలో బడాపంజా పీర్ల ఊరేగింపు శనివారం రాత్రి సాంప్రదా యబద్ధంగా జరిగింది. శాలిబండ గడియారం నుండి ప్రారంభమైన ఊరేగింపు నాగులచింత చౌరస్తా, సయ్యద్ అలీ చబుత్ర, అలియాబాద్, శంషీర్‌గంజ్, ఇంజన్‌బౌలి మీదుగా జహనుమా వరకు సాగింది. దారి పొడవున భక్తులు దట్టీలు, పూలు, కొబ్బరి కుడుకలు సమర్పించారు. అలియాబాద్, శక్కర్‌గంజ్, సయ్యద్ అలీచబుత్ర ప్రాంతాల నుండి చిన్నపీర్లు ఊరేగింపుగా వచ్చి బడాపంజాతో కలిసి సామూహిక ఊరేగింపుగా మారాయి. పరిసర ప్రాంతాలలో ప్రత్యేక అంగళ్లు వెలిశాయి. పిల్లలు పెద్దలు, మహిళలు, చిన్నపిల్లలు తమకు అవసరమైన వస్తువులను ఖరీదు చేశారు. పోలీసులు తగిన బందోబస్తును కల్పించారు.



బోనాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## 20న ఢిల్లీలో లాల్‌దర్వాజా బోనాలు

**చాంద్రాయణగుట్ట, జూన్ 28, ప్రభాతవార్త :** తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా న్యూఢిల్లీలో జూలై 20వ తేదీ నుండి మూడు రోజుల పాటు నిర్వహించే చారిత్రక లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ ఆలయ కమిటీతో కలిసి ఆవిష్కరించారు. ఆలయ చైర్మన్ జి.అరవింద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాల గురించి వివరించారు. అందుకు స్పందించిన మంత్రి దేశ రాజధానిలో నిర్వహించే బోనాల ఉత్సవాలను ప్రభుత్వం తరపున ఘనంగా నిర్వహిస్తామన్నారు. అందుకు అవసరమైన సహకారం కమిటీకి అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి మాజీ చైర్మన్లు జి.కాశీనాథ్ గౌడ్, కె.వెంకటేష్, ఎ.బద్రినాథ్ గౌడ్, పోసాని సురేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పోసాని సతీష్ ముదిరాజ్, కోశాధికారి జి.హరీష్ గౌడ్, కమిటీ ప్రతినిధులు రంగ హరినాథ్ గౌడ్, రంగ శ్రీకాంత్ గౌడ్, ఎ.భరత్ కుమార్, దశరథ్ సప్నేకర్, జి.హరీష్ గౌడ్, జి.మణికంటేష్ గౌడ్, ఎ.యశ్వంత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు నర్సింహ గౌడ్, దుర్గేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ నగర్ అగ్రోమెక్ గోదాములో అగ్నిప్రమాదం

**సంజీవరెడ్డి నగర్, జూన్ 28, ప్రభాతవార్త :** సంజీవరెడ్డి నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అగ్రోమెక్ స్టోరేజ్ గోదాములో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సనత్‌నగర్ ఫైర్ ఇన్‌స్పెక్టర్ సి. పూర్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... అగ్రోమెక్ గోదాము మూడో అంతస్తులోని ప్లగ్ హోల్డర్లలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చేలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే సనత్‌నగర్ ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు ఆర్పివేయడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ ప్రమాదంలో గోదాము యూనిట్3, మూడో అంతస్తులోని వైరింగ్‌తో పాటు సీసీ కెమెరాలు పూర్తిగా లభ్యమయ్యాయని, సుమారు రూ. 25 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా గుర్తించామని ఆయన పేర్కొన్నారు.



